# జంక్షన్.. టెన్షన్

**జాతీయ రహదారిపై వలు జంక్షన్లు వాహన చోదకులకు దడ పుట్టిస్తున్నాయి. ఆ జంక్షన్లను దాటితే హమ్మయ్యా అనుకొనే పరిస్థితి కనిపిస్తోంది. ఎన్ని ప్రాంతాలు తిరిగొచ్చినా ఈ కూడళ్లు దాటితే చాలు దేవుడా అని వాహన చోదకులు** అనుకుంటున్నారంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఆయా జంక్షన్ల వద్ద ట్రాఫిక్ నిత్యం గందరగోళంగా మారుతోంది. వాహన చోదకులను ఆందోళనకు గురి చేస్తూనే ఉంటుంది. దీంతో సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేక ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. – గాజువాక



బీహెచ్‌పీవీ వద్ద జాతీయ రహదారిపైకి అడ్డదిడ్డంగా వెళ్లిపోతున్న వాహనచోదకులు

గాజువాకలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కంటి తుడుపు చర్యగా మారిందనే విమర్శలున్నాయి. గాజువాక ప్రాంతంలోని జాతీయ రహదారిపై నాలుగైదు ప్రధాన జంక్షన్లలో వాహనాలు బారులు తీరుతున్నాయి. ఈ పరిస్థితి వాహనచోదకులను కలవరానికి గురి చేస్తోంది. పీక్ సమయంలో ఈ జంక్షన్లను దాటేందుకు కనీసం గంట సమయం అదనంగా పడుతోందని వాహనచోదకులు చెబుతున్నారు.అయినా అధికారులు, పాలకులు పత్యామ్నాయ చర్యలు ఆలోచించడం లేదని మండిపడుతున్నారు.

**నిత్యం ప్రమాదాలు**

జాతీయ రహదారిపై ప్రమాదాలు కూడా అధికంగానే చోటుచేసుకొంటున్నాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు నామమాత్రంగా ఉండడంతో వాహనచోదకులు నిబంధనలు కూడా సక్రమంగా పాటించని పరిస్థితి ఉంది. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకొంటున్నాయి. విశాఖ డెయిరీ, ఆటోనగర్, చినగంట్యాడ, శ్రీనగర్, వడ్లపూడి, కూర్మన్నపాలెం జంక్షన్లను దాటేందుకు అటు పాదచారులు, ఇటు వాహన చోదకులు ఆందోళన చెందుతుంటారు. ఈ జంక్షన్లలో ఎక్కువగా ద్విచక్ర వాహనాచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సిగ్నల్ వ్యవస్థ పక్కాగా పని చేసే విధంగా చర్యలు చేపట్టాలని జనం కోరుతున్నారు. రాత్రి పది గంటల వరకు పోలీస్ పర్యవేక్షణతో పాటు విద్యుద్దీపాలను అందుబాటులోకి తేవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

**కూడళ్లలో ముందుకు కదలని వాహనాలు**

**జాతీయ రహదారిపై నిత్యం నరకం**

**సమయానికి చేరుకోలేక అవస్థలు**

**ప్రత్యామ్నాయం చూపని పాలకులు, అధికారులు**

### బీహెచ్‌పీవీ జంక్షన్

**బీహెచ్‌పీవీ జంక్షన్ వద్ద ఆర్టీసీ** బస్టాప్ సిగ్నల్‌కు **దగ్గరగా ఉంది. అక్కడ ఆర్టీసీ బస్సులు,** ఆటోలు ఆగుతాయి. అదే సమయంలో గ్రీన్ సిగ్నల్ పడితే వెనక నుంచి వెళ్లే వాహనాలకు ఇబ్బంది కలుగుతోంది. మింది రోడ్ కూడా అక్కడే జాతీయ రహదారికి అనుసంధానమై ఉంటుంది. దీంతో అన్ని పక్క నుంచీ ఒకేసారి వాహనాలు వస్తుంటాయి. ఈ కారణంగా ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ ఎప్పటికప్పుడు అస్తవ్యస్తంగా మారి వాహనాలు కదల్లేని పరిస్థితి తలెత్తుతోంది. దీంతో తరచూ ప్రమాదాలు కూడా చోటుచేసుకొంటున్నాయి. ఈ జంక్షన్ దాటడానికి పది నుంచి 20 నిమిషాల సమయం పడుతోందని వాహన చోదకులు పేర్కొంటున్నారు.

### వందడుగుల రోడ్ జంక్షన్

గాజువాకకు ఈ జంక్షన్ గుండెకాయ వంటిది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు ఇక్కడే కొలువై ఉన్నాయి. జాతీయ రహదారి నుంచి గంగవరం పోర్టు, స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే భారీ వాహనాలు ఇటు నుంచే వెళ్తుంటాయి. ఇక్కడ సిగ్నల్ పడితే వాహనాలు కదలడానికి కనీసం 20 నిమిషాల సమయం పడుతోంది. ఇక్కడ పోలీసు నిఘా కేవలం కేసులు రాయడానికి తప్ప ట్రాఫిక్ నియంత్రణపై ఉండటం లేదనే విమర్శలున్నాయి. విధుల్లో ఉండే ట్రాఫిక్ కానిస్టేబుళ్లు కూడా ఎక్కడో ఒక మూల కూర్చొని కాలక్షేపం చేస్తుంటారనే ఆరోపణలున్నాయి.



ప్రమాదాలకు నిలయమైన వడ్లపూడి జంక్షన్



అగనంపూడి జంక్షన్ వద్ద బారులు తీరిన వాహనాలు

### శ్రీనగర్ జంక్షన్

గాజువాకలో ప్రధానమైన జంక్షన్లలో శ్రీనగర్ ఒకటి. ఇక్కడ ప్రమాదాలు రోజుకొకటైనా చోటు చేసుకోవడం పరిపాటి. గాజువాక ఆటోనగర్ నుంచి అటు విజయవాడ వైపు వెళ్లడానికైనా, ఇటు శ్రీకాకుళం, భువనేశ్వర్‌వైపు వెళ్లడానికి భారీ వాహనాలు ఎక్కువగా ఉపయోగించే జంక్షన్ ఇది. ఆటోనగర్‌లోకి వెళ్లే ఒక భారీ వాహనం జంక్షన్‌లో ఆగిపోతే గాజువాక మొత్తం ట్రాఫిక్ స్తంభించిపోయిన దాఖలాలున్నాయి. ఇంతటి ప్రాధాన్యం గల జంక్షన్‌లో సిగ్నళ్లు పని చేయని దుస్థితి నెలకొంది.

### డేంజర్ అగనంపూడి జంక్షన్

అగనంపూడి జంక్షన్‌లోనూ నిరంతరం ఇదే పరిస్థితి ఎదురవుతోంది. అగనంపూడికి కుడి, ఎడమల నుంచి వచ్చే వాహనాలతో పాటు జాతీయ రహదారిపై వచ్చే వాహనాల వల్ల ఇక్కడ విపరీతమైన ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఇక్కడి సిగ్నల్ వద్ద నిరంతరం వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోతుంటాయి. దీంతో ఈ జంక్షన్‌కు చేరుకొనే వాహనదారులు జంక్షన్ దాటేవరకు టెన్షన్ పడుతుంటారు.

### ఇలా చేస్తే కొంతమేలు

జంక్షన్లవద్ద అప్రోచ్‌లను ఆనుకొని వాహనాల పార్కింగ్ లేకుండా చూడాలి. జాతీయ రహదారిపై బస్టాప్‌ల వద్ద లారీల పార్కింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలి. జంక్షన్లలో వాహనాలు మలుపు తిరిగేవరకు వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలను అరికట్టడం కోసం ఎక్కడికక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో విద్యుద్దీపాలను అందుబాటులోకి తేవాలి.

## రేపు ఉక్కునగరంలో ఉగాది వేడుకలు

**ఉక్కునగరం:** ఉగాది వేడుకలకు ఉక్కునగరంలోని స్టీల్‌క్లబ్, ఆంధ్రకేసరి కళాక్షేత్రాలు సిద్ధమవుతున్నాయి. ఆదివారం స్టీల్‌క్లబ్‌లో పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశామని క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి వై. రవికుమార్, కోశాధికారి డి. వేణుగోపాల్ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఫోక్ సింగర్ సాయి సురేష్ బృందంతో నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. వైఆర్‌కే సంగీత కచేరి జరుగుతుందన్నారు. కవి సమ్మేళనం అనంతరం హైదరాబాద్‌కు చెందిన ల్యాండ్‌రైజ్ రియాల్టీ వారు బహుమతులు అందజేస్తారని తెలిపారు. క్లబ్ సభ్యులంతా వేడుకలకు హాజరు కావాలని వారు కోరారు.

● ఆంధ్రకేసరి కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని కళాక్షేత్రం కార్యదర్శి టి. సత్యనారాయణ తెలిపారు. పంచాంగ శ్రవణం, వేద ఆశీర్వచనం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ఉక్కు ఉద్యోగులను సత్కరించనున్నామని ఆయన తెలిపారు.

## చలివేంద్రం ఏర్పాటు

**అగనంపూడి:** వంగవీటి రాధా రంగ మిత్రమండలి సారథ్యంలో 88వ వార్డు తలారివానిపాలెం రైల్వే ట్రాక్‌ను ఆనుకొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఎం.ముత్యాలనాయుడు, మిత్ర మండలి ప్రతినిధులు మోటూరి వెంకటరమణ, దానబాల అప్పలనాయుడు, విందుల నారాయణరావు, బలిరెడ్డి సత్యనారాయణ, డి.వి. అప్పారావు, మజ్జి శ్రీను పాల్గొన్నారు.

## వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్ ప్రారంభం



79వ వార్డులో వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

**అగనంపూడి:** జీవీఎంసీ 79వ వార్డు గళ్లవానిపాలెం షిర్డీసాయినగర్‌లో నిర్మించిన వాకింగ్‌ట్రాక్, ఓపెన్ జిమ్‌ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ.50 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయడం సంతోషంగా ఉందన్నారు. రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, నాయకులు దంతులూరి సుబ్బరాజు, మేడిశెట్టి విజయ్, కర్రి దశేంద్ర, కరణం సత్యారావు, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఘనంగా వైఎస్సార్ టీయూసీ ఆవిర్భావ దినోత్సవం



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద కేక్ కట్ చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

**పెదగంట్యాడ:** కార్మికుల సంక్షేమం కోసం, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం వైఎస్సార్ టీయూసీ నాయకులు పాటు పడాలని వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, యూనియన్ నాయకులు డీవీ రమణారెడ్డి, దాల్ నాయుడు, గళ్లా శంకర్‌సాయిరాం, పుల్లారావు, నూకరాజు, ఎన్నేటి రమణ తదితరులు పాల్గొన్నారు.

### పదవీ విరమణ ఉద్యోగులకు సత్కారం



పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులను సత్కరిస్తున్న అధికారులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తున్న సీఆర్‌ఎంపీ విభాగానికి చెందిన నలుగురు ఉద్యోగులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. విభాగం కాన్ఫరెన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో విభాగం డీజీఎంలు ఎల్. మల్లికార్జునరావు, ఫిలిప్ కందూల, ఏజీఎం టి. శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎన్.వి.ఆర్. మూర్తిలకు శాలువా కప్పి అభినందించారు. మెకానికల్ ఇన్‌చార్జ్ వై. బాల కోటయ్య మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. ఐఎన్‌టీయూసీ సహాయ ప్రధానకార్యదర్శి ఎన్. రమేష్ కుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అధికారులు డి. దేవానంద్, బేద్‌రామ్, కె. తావు, పి. అప్పారావు, ఆర్. భాస్కరరావు, బి. వెంకటేశ్వరరావు, జి.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


### కరెంట్ చార్జీలు పెంచడం దుర్మార్గం



చట్టివానిపాలెంలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

**అక్కిరెడ్డిపాలెం:** చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీల్లో భాగంగా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక చార్జీలు పెంచడం దుర్మార్గమని సీపీఎం జోన్ కార్యదర్శి జి.రాంబాబు అన్నారు. విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గాజువాకలోని ఏపీఈపీడీఎల్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం విద్యుత్ చార్జీలు తగ్గించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జోన్ నాయకులు ఎ.లోకేష్, ఎల్.బంగారు నాయుడు, కె.సంతోషం, జి.లక్ష్మి, కె.కిరీటం, గొలగాని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### కరెంటు చార్జీలు తగ్గించాలని ధర్నా



పెదగంట్యాడ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

**పెదగంట్యాడ:** రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్‌రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో పెదగంట్యాడ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. వెంటనే పెంచిన చార్జీలను తగ్గించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గురప్ప, వెంకటరావు, కణితి అప్పలరాజు, రాముడు, అప్పలరెడ్డి, ఆనంద్, వీరారెడ్డి పాల్గొన్నారు.

## గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షురాలిగా యశోధర



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

**తొలిసారి అధ్యక్షురాలిగా మహిళ ఎన్నిక**

**గాజువాక:** గాజువాక న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) అధ్యక్ష కార్యదర్శులుగా బి.యశోధర వేదమణి, డి.చిరంజీవి గెలుపొందారు. గాజువాక బార్ అసోసియేషన్‌కు అధ్యక్షురాలిగా మహిళ ఎన్నిక కావడం ఇదే తొలిసారి. శుక్రవారం నిర్వహించిన ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా పల్లా శ్రీనివాసరావు, కోశాధికారిగా ఇ.గిల్బర్ట్ గెలుపొందినట్టు ఎన్నికల అధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. కాగా, ఉపాధ్యక్షురాలిగా కె.సత్యవాణి, గ్రంథాలయ కార్యదర్శిగా బి.వి.ఎం.కృష్ణ, మహిళా ప్రతినిధిగా ఎం.సూర్యకళ, కార్యవర్గ సభ్యులుగా ఎ.మురళీ మోహనరావు, సీహెచ్.గంగాభవాని, మంత్రి విజయ, ఆర్.రేవతి, ఎం.కనక మహాలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. విజయం సాధించిన అభ్యర్థులకు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. సహాయ ఎన్నికల అధికారిగా న్యాయవాది పి.పార్వతీశం వ్యవహరించారు.

## కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై కమిటీ ఏర్పాటు చేయాలి



చర్చల్లో పాల్గొన్న యాజమాన్యం, కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ప్రతినిధులు

**ఉక్కునగరం:** కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపుపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర కార్మికశాఖ డిప్యూటీ లేబర్ కమిషనర్ (డీసీఎల్) డి. శ్రీనివాసులు ఉక్కు యాజమాన్యానికి సూచించారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె నోటీసుపై శుక్రవారం సాయంత్రం నగరంలో ఉక్కు యాజమాన్యం, కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు, కాంట్రాక్టర్లతో డీసీఎల్ సమావేశం ఏర్పాటు చేశారు. అక్రమ తొలగింపులు ఆపాలని, 45 ఏళ్లు దాటిన వారికి వైద్య పరీక్షలు రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై డీసీఎల్ మాట్లాడుతూ కార్మికుల తొలగింపుపై కాంట్రాక్టర్లు, కార్మిక సంఘాలు, యాజమాన్యం ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. పని లేదని తొలగించిన కార్మికులను ఒక పూల్‌గా ఏర్పాటు చేసి తిరిగి పని వచ్చినప్పుడు వారినే తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 7న తదుపరి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో రీజనల్ లేబర్ కమిషనర్ మొహంతి, యాజమాన్య ప్రతినిధులతో పాటు కాంట్రాక్టర్ల సంఘం నాయకులు బొడ్డ సన్యాసిరావు, అప్పలనాయుడు, కార్మిక సంఘాల నాయకులు కె.ఎం. శ్రీనివాస్, నీరుకొండ రామచంద్రరావు, జి. శ్రీనివాసరావు, మంత్రి రవి, సత్యారావు, వంశీకృష్ణ, గుర్నాథ్ పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌తో పెయింటర్‌కు తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలపాలైన పెయింటర్ రాజేష్



పేలిపోయిన ఇన్వర్టర్



ప్రమాదానికి కారణమైన బిల్డింగ్‌పై హెచ్‌టీ వైర్లు

**అక్కిరెడ్డిపాలెం:** పెయింట్ వేయడానికి మేడ ఎక్కుతుండగా మేడపై నుంచి కొనసాగుతున్న హెచ్‌టీ లైన్ ఎర్త్‌తో పెయింటర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. శుక్రవారం జరిగిన ఘటనకు సంబంధించి గాజువాక పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు... గాజువాకలోని డ్రైవర్స్ కాలనీలో ద్రోణంరాజు కల్యాణ మండపం పక్కనున్న బిల్డింగ్‌కు పెయింట్ వేయడానికి శ్రీనగర్‌కు చెందిన పెయింటర్ పి.రాజేష్ (27) ఒప్పు కున్నాడు. అయితే పెయింట్ వేయాల్సిన బిల్డింగ్‌పై హెచ్‌టీ వైర్లు కొనసాగుతున్నాయి. బిల్డింగ్‌పై చేరుకుని వైర్లకు సమీపంలో పెయింట్ వేస్తుండగా ఒక్కసారిగా వైర్ నుంచి ఎర్త్ వల్ల షాక్‌కు గురవ్వడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పెయింటర్ పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. కాగా పెయింటర్ షాక్ గురవ్వడంతో సుమారు 10 నుంచి 15 నివాసాల్లో ఇన్వర్టర్లు, బ్యాటరీలు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పెదగంట్యాడ:** జీవీఎంసీ 75వ వార్డు పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కండిపిల్లి వీధిలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మించనున్నామన్నారు. అలాగే దుర్గావానిపాలెం, పల్లివీధి, నెల్లిముక్కులో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించేందుకు శ్రీకారం చుట్టామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పులి వెంకట రమణారెడ్డి, కిల్లాన మునలయ్య పాల్గొన్నారు.

## గ్రామీణ విద్యా వికాస కేంద్రం ప్రారంభం



విద్యా వికాస కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ హేమంత్ ఖత్రి

**అగనంపూడి:** హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, భారత్ డైనమిక్ లిమిటెడ్, మిథాని గ్రూప్ సంయుక్తంగా దువ్వాడ సమీపంలోని గొల్లలపాలెంలో నిర్మించిన గ్రామీణ విద్యా వికాస కేంద్రాన్ని ప్రారంభించారు. చిన్మయి మిషన్ విశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన వికాస కేంద్రాన్ని హెచ్‌ఎస్‌ఎల్ సీఎండీ హేమంత్ ఖత్రి, బీడీఎల్ యూనిట్ హెడ్ ఎస్.గౌరీ శంకర్‌రావు, మిథానీ డైరెక్టర్ (ఫినాన్స్) డి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్మయి మిషన్ గ్రామీణ ప్రాంతాల్లోని అట్టడుగు వర్గాల అభ్యున్నతి, విద్యాభివృద్ధి కోసం గత దశాబ్దన్నర కాలంగా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వీరి సేవలను మెచ్చి తాము ఈ వికాస కేంద్రాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చామన్నారు. కార్యక్రమంలో చిన్మయి మిషన్ హెడ్ స్వామి రాఘవేంద్రస్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపు

**పెదగంట్యాడ:** భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు శుక్రవారం ఉక్కుపాదం మోపారు. తహసీల్దార్ పి.అమల తెలిపిన వివరాల మేరకు.. పెదగంట్యాడ మండలం, పెదగంట్యాడ గ్రామ సర్వే నెంబర్ 64/1డిలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన స్థలం ఉంది. ఆ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి అక్రమంగా షెడ్లు నిర్మించారని లోకాయుక్తకు ఫిర్యాదు అందింది. అధికారులు ఆయా స్థలాలను పరిశీలించారు. ఆ స్థలాలు స్టీల్‌ప్లాంట్‌కు చెందినవిగా గుర్తించి నిర్మాణాలను తొలగించారు. అలాగే పెదగంట్యాడ సర్వే నెంబర్ 29లో సుమారు 80 చదరపు గజాల స్థలంలో నిర్మించిన నిర్మాణాలను తొలగించారు.

**డబ్బులు మాయం అంటూ ఫిర్యాదు**

పెదగంట్యాడ టిడ్కో గృహాల సమీపంలో షెడ్డు నిర్మించుకుని గత 15 సంవత్సరాలుగా కుటుంబంతో నివాసం ఉంటున్నానని చీకటి హారిక అనే మహిళ ఇటు రెవెన్యూ, అటు స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులపై న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కోర్టు స్టే ఉన్నప్పటికీ తమ నిర్మాణాన్ని తొలగించారని అందులో ఉన్న టీవీ, ఫ్రిడ్జ్, పావు తులం చెవిదుద్దులు, రూ.10,600 నగదు మాయమయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని వినతి



భెల్ ఈడీ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేస్తున్న గుర్తింపు యూనియన్ ప్రతినిధులు

**అక్కిరెడ్డిపాలెం:** భెల్ (హెచ్‌పీవీపీ)లో రిటైర్ అయిన ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని కోరుతూ సంస్థ గుర్తింపు యూనియన్ (యునైటెడ్ ఫ్రంట్) ఆధ్వర్యంలో ప్రతినిధులు యాజమాన్యంతో సుదీర్ఘ చర్చలు జరిపారు. శుక్రవారం యూనియన్ ప్రధానకార్యదర్శి సుభాకర్ సాహూ మాట్లాడుతూ భెల్ అన్ని యూనిట్లలో మాదిరిగానే హెచ్‌పీవీపీలో ఈపీఎస్ 95 పెన్షన్ ఉండాలన్నారు. కానీ దీనికి విరుద్ధంగా ఇక్కడ పెన్షన్ అమలు కావకపోవడంతో రిజక్ట్ అయ్యిందని తెలిపారు. హైదరాబాద్ యూనిట్‌లో కొందరికి హయ్యర్ పెన్షన్ అమలు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. అక్కడ మాదిరిగానే విశాఖపట్నం యూనిట్‌లో కూడా హయ్యర్ పెన్షన్ అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈడీ జి.సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ (జీఎం) ఓపీఎస్, ప్రొడక్షన్ (హెచ్‌ఆర్) సి.గౌరీశంకర్, సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) జి.చంద్రశేఖర్, యూనియన్ ప్రతినిధులు కొల్లి దేముడు, పి.వి.ఎస్.రాజు, టెక్కలి భాస్కరరావు, పి.రవీంద్రబాబు, పి.వీరబాబు, వి.గోవిందరావు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## కొత్త అమావాస్య జాతరకు నూకాంబిక ఆలయాల ముస్తాబు



వెంపళ్లనగర్‌లో నూకాంబిక అమ్మవారి ఆలయం



పెదనడుపూరులో విద్యుత్ వెలుగుల్లో నూకాంబిక అమ్మవారి ఆలయం

**పెదగంట్యాడ:** కొత్త అమావాస్య వేడుకలకు మండలంలోని నూకాంబిక ఆలయాలు సిద్ధమయ్యాయి. ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే ఉత్సవాలను పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 73వ వార్డు పరిధిలోని చిననడుపూరులోని ఆలయంతో పాటు జీవీఎంసీ 76వ పరిధి పెదనడుపూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయం, వెంపళ్లనగర్‌లోని నూకాంబిక, దయాల్‌నగర్‌లోని స్వర్ణనూకాంబిక అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలకు ఆయా ఆలయాల ఉత్సవ కమిటీల ప్రతినిధులు సర్వం సిద్ధం చేశారు. గ్రామాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

## 2 నుంచి స్టీల్‌క్లబ్‌లో స్విమ్మింగ్ కోచింగ్ క్యాంప్



స్టీల్‌క్లబ్ స్విమ్మింగ్ పూల్

**ఉక్కునగరం:** సెక్టార్-1 స్టీల్‌క్లబ్‌లో వచ్చే నెల 2 నుంచి స్విమ్మింగ్ కోచింగ్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నామని క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ తెలిపారు. 15 రోజులుగా స్విమ్మింగ్ పూల్ ఆధునికీకరణ పనులు పూర్తి చేశామన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది వేసవిలో స్విమ్మింగ్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా క్లబ్ సభ్యులతో పాటు ఇతరులకు కూడా స్విమ్మింగ్ కోచింగ్ ఇవ్వనున్నామని చెప్పారు. మే చివరి వరకు క్యాంప్ కొనసాగుతుందన్నారు. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లుగా జరిగే కోచింగ్ క్యాంప్‌నకు ఆసక్తి కలిగిన వారు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98665 60999 ను సంప్రదించాలని ఆయన కోరారు.